సాక్షి
పార్వతీపురం మన్యం
మంగళవారం । 24 । డిసెంబర్ । 2024



సమస్యల పరిష్కారం దిశగా చర్యలు
సమస్యలను సావధానంగా విని, తక్షణమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ ఆదేశించారు. - 8లో



లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు
ఆరికతోట ముచ్చర్లవలస గ్రామాల మధ్య జాతీయ రహదారిపై సోమవారం లారీలు, బస్సు ఢీకొనడంతో ప్రయాణికులు గాయపడ్డారు. - 8లో



సబ్‌జైల్ తనిఖీ - 8లో
పార్వతీపురం పట్టణంలోని సబ్‌జైల్‌ను విజ యనగరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ చక్రవర్తి తనిఖీ చేశారు.

న్యూస్‌రీల్

విజయమే లక్ష్యం కావాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్

పార్వతీపురంటౌన్: డీఎస్సీలో విజయమే లక్ష్యంగా చదువు సాగించాలని కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ ఉపాధ్యాయ అభ్యర్థులకు సూచించారు. పార్వతీపురం గిరిజన భవన్‌లో నిర్వహిస్తున్న డీఎస్సీ ఉచిత శిక్షణ కేంద్రాన్ని ఆయన సోమవారం సందర్శించారు. అభ్యర్థులతో ముఖాముఖిగా మాట్లాడుతూ బోధన, ఆహార సదుపాయాలు, ఇతర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ తాము ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారో దాని పట్ల మరింత ఏకాగ్రతతో చదువుతూ పట్టు పెంచుకోవాలని సూచించారు. అసాధ్యాలను సుసాధ్యం చేసేలా కృషి చేసి విజయాన్ని అందుకోవాలని ఆకాంక్షించారు. టాపర్లుగా నిలవాలనే ఆలోచన ఆశయ సాధనకు మూలం కాగలదని చెప్పారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అవగాహన చేసుకోవడం, వాటి మోడల్ పేపర్లను సాధన చేయడం ద్వారా విజయాలు అందుకోగలరని కలెక్టర్ చెప్పారు. తెలివితేటల్లో అందరూ దాదాపుగా సమానంగా ఉంటారని, కృషి విజయాలను సాధించి పెడుతుందనే అంశాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని చెప్పారు. కోష్టఫలి అనే నానుడిని ఉదాహరిస్తూ ఫలితాల సాధనకు మన ఆత్మవిశ్వాసం, నమ్మకం ఉపకరిస్తుందని తెలిపారు. లక్ష్యసాధన దిశగా ప్రతి ఒక్కరూ ప్రతి క్షణం సాధన చేయాలని, కుటుంబాలను అభివృద్ధి దిశగా తీసుకుపోవడానికి కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ నాయుడు, ఐటీడీఏ ఏపీఓ ఎ.మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కర్షకుని వర్ణ చిత్రం



నాగలిపట్టి పొలానికి వెళ్తున్న రైతు వర్ణచిత్రం

గరుగుబిల్లి: జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా నాగూరు గ్రామానికి చెందిన నఖచిత్ర కారుడు పల్ల పరిశినాయుడు వేసిన 'భుజంపై నాగలిపట్టి పొలానికి వెళ్తున్న రైతు' వర్ణ చిత్రం పలువురిని ఆకర్షించింది. ఆయన పర్వదినాలు, ప్రత్యేక దినాలను పురస్కరించుకొని వేస్తున్న చిత్రాలు ఈ ప్రాంతీయులను ఆకట్టుకుంటున్నాయి.

డ్వామా పీడీగా శారదాదేవి



విజయనగరం ఫోర్ట్: జిల్లా నీటియాజయాన్య సంస్థ (డ్వామా) పీడీగా ఎస్.శారదాదేవి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం పంచాయతీ రాజ్ ప్రిన్సిపాల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ డ్వామా పీడీగా పనిచేసిన ఇ.సందీప్ సెలవు పెట్టడంతో అతని స్థానంలో ఎస్.కోట ఏపీడీ, డీఎల్‌డీఓగా పనిచేస్తున్న శారదాదేవిని నియమించారు.

చెరకు క్రషింగ్ పునఃప్రారంభం



రేగిడి ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారానికి చెరకును తరలిస్తున్న రైతులు

రేగిడి: మండలంలోని సంకిలి ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం చెరకు క్రషింగ్‌ను సోమవారం పునఃప్రారంభించింది. ఇటీవల అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు చెరకు క్రషింగ్‌ను నిలుపుదల చేసింది. ప్రస్తుతం వర్షాలు తగ్గడం, చెరకును రైతులు తరలిస్తుండడంతో క్రషింగ్‌ను ప్రారంభించింది.

ఎవరి వలకు చిక్కెనో చేపపిల్ల!



- కేంద్ర ప్రభుత్వ పథకం నిధుల దోపిడీకి స్కెచ్
- టెండర్ లేకుండా చేప పిల్లల సరఫరాకు యత్నం!
- అయిన వారికి కట్టబెట్టేందుకు సన్నాహాలు
- వరంగా ప్రభుత్వ నిబంధనలు

సాక్షి, పార్వతీపురం మన్యం: వల వేయకుండానే చేప పిల్లలను పట్టేసేందుకు కొంతమంది ప్రయత్నాలు సాగిస్తున్నారు. మత్స్యశాఖలోని పెద్దల అండదండలతో మొత్తం గుటుక్కున మింగేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. అయినవారికి అప్పనంగా చేప పిల్లల సరఫరా కాంట్రాక్టును అప్పగించేందుకు రంగం సిద్ధమవుతోందని వినికిడి. టెండర్ల విధానానికి స్వస్తి పలకాలని ప్రభుత్వం చెప్పడం వీరికి వరంగా మారింది. జిల్లా ప్రొక్యూర్‌మెంట్ కమిటీ(డీపీసీ) ద్వారా కాంట్రాక్టును కట్టబెట్టేందుకు పావులు కదుపుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇదీ లెక్క...

జిల్లాలోని జలాశయాల్లో ఈ ఏడాది 44.22 లక్షల చేప పిల్లలను వదలాలని ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా మత్స్య సంపదను పెంచాలన్నది దీని ప్రధాన ఉద్దేశం. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద ఇందుకోసం పెద్ద ఎత్తున నిధులు మంజూరవుతున్నాయి. వాస్తవానికి ఆన్‌లైన్ విధానంలో టెండర్లు పిలిచి చేప పిల్లల సరఫరా బాధ్యతను అప్పగించాల్సి ఉంది. వానాకాలానికి ముందే ఇది జరిగిపోవాలి. అప్పుడే చేప పిల్లలు బతకడానికి ఎక్కువ అవకాశం ఉంటుంది. ఇక్కడే మత్స్యశాఖ అధికారులు కొంతమంది చక్రం తిప్పి, ఈ ప్రక్రియను జాప్యం చేశారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పుడు జిల్లా ప్రొక్యూర్‌మెంట్ కమిటీ ద్వారా కొటేషన్లు పిలవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే.. టెండర్లు లేకుండానే జిల్లాలో ఏకమొత్తంగా ఒకే కాంట్రాక్టరుకు అప్పగించేందుకు తెర వెనుక ప్రయత్నాలు జరిగిపోయినట్లు సమాచారం.

పిల్లకు రూ.1.27 పైసలు!

ఇప్పటికే సీతంపేట పరిధికి సంబంధించి శ్రీకాకుళం జిల్లా ప్రాతిపదికన టెండర్ ఖరారు చేసినట్లు సమాచారం. అక్కడ గుత్తేదారు రూ.21 లక్షలకు టెండరు దక్కించుకున్నట్లు తెలుస్తోంది. ఒక చేపపిల్లకు రూ.1.27 పైసలు చొప్పున కట్టబెట్టారు. పార్వతీపురం మన్యం జిల్లాకు సంబంధించి కూడా ఎల్-1కే (అదే కాంట్రాక్టరుకు) ఇచ్చేందుకు నెల రోజుల కిందటే అనధికారికంగా అంగీకారానికి వచ్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. దీని కంటే 20 పైసలు వరకు తగ్గించి చేస్తామని కొంతమంది కాంట్రాక్టర్లు ముందుకొచ్చినప్పటికీ అధికారుల నుంచి సహకారం కొరవడినట్లు సమాచారం.



అనువుగాని కాలంలో...

జిల్లాలో చేపల సంపద అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉంది. మత్స్య సంపద ద్వారా ఏడాదికి దాదాపు రూ.194 కోట్లు ఆదాయం చేకూరుతోంది. జిల్లాలో ఉన్న అన్ని పంచాయతీల్లో సుమారు 1,800 చెరువులు ఉన్నాయి. చేపల పెంపకంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 96 వేల మంది ఆధారపడి ఉన్నారు. వాస్తవానికి జలాశయాల్లో వేసేందుకు ఏటా ఆగస్టు నుంచి నవంబర్ నెలలోగా మత్స్యకారులకు చేపపిల్లలను పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఈ ఏడాది డిసెంబర్ చివరి వారం వచ్చేసినా ఇంకా ఆ ప్రక్రియ చేపట్టలేదు. ప్రస్తుతం చెరువుల్లో నీరు తక్కువగా ఉంది. ఈ కాలం అంత అనువైనది కాదని మత్స్యకారులు అంటున్నారు. చిన్న పిల్లలు వేయగానే.. పెద్ద చేపలు కొట్టేస్తాయని చెబుతున్నారు. ఫలితంగా ఇప్పుడు వేసిన పిల్లలు బతకడం కష్టమని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఏటా జలాశయాల్లో చేప పిల్లల ఉత్పత్తికి సంబంధించి పెద్ద ఎత్తున అక్రమాలు చోటుచేసుకుంటున్న విషయం విదితమే. చెరువులో ఎన్ని వదిలారు, ఎన్ని బతికాయి? అన్న విషయాలపై లెక్కలు ఉండవు. ఇదే అదునుగా లేని లెక్కలు చూపి, అధికారులు దోచుకుంటున్నారన్న విమర్శలు ఎప్పటి నుంచో వినిపిస్తున్నాయి. ఇప్పుడు సరఫరా కాంట్రాక్టులోనూ తమకు నచ్చిన వారికే కట్టబెట్టి మరింత దోపిడీకి తెర తీస్తున్నారన్న ఆరోపణలు ఇదే రంగంలో ఉన్న పలువురు కాంట్రాక్టర్ల నుంచి వ్యక్తమవుతున్నాయి.

బాబుపాలనలో భారాల బాదుడు



ధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, తదితరులు

- విద్యుత్ భారానికి నిరసనగా 27న విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా
- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: టీడీపీ కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలపై వివిధ భారాల బాదుడు గ్యారంటీగా మారిందని, భవిష్యత్‌కు గ్యారంటీ లేకుండా పోయిందని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర విమర్శించారు. సాలూరులోని తన స్వగృహంలో స్థానిక విలేకర్లతో ఆయన సోమవారం మాట్లాడారు. ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చిన టీడీపీ కూటమి నేతలు... ఇప్పుడు ప్రజలపై బిల్లుల భారం వేస్తున్నారని ఆరోపించారు. డిస్కంలను ఆదుకునేందుకు చంద్రబాబు చేసిన సాయం రూ.13,255 కోట్లు మాత్రమే కాగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.47,000 కోట్లు అందించి డిస్కంలకు చేయూతనిచ్చిందని వివరించారు. ఓ వైపు విద్యుత్ చార్జీలు, మరోవైపు భూముల రిజిస్ట్రేషన్ చార్జీలు, వరద సెస్‌లు, చివరికి పేదవాని పూరిగుడిసెల మీద కూడా భారం మోపడానికి టీడీపీ కూటమి ప్రభుత్వం సమాయత్తమవుతోందన్నారు. నవంబర్, డిసెంబర్ నెలల్లో ప్రజలపై సుమారు రూ.15,485.36 కోట్ల విద్యుత్ భారం మోపిందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందని ద్రాక్షగా కనిపిస్తోందన్నారు. పేద ప్రజలపై భారం వేయడమే చంద్రబాబు సంపద సృష్టంటూ మండిపడ్డారు.

సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయకుండా, సర్వేల పేరుతో పింఛన్ల తొలగింపునకు పూనుకోవడం అన్యాయమన్నారు. ప్రజలపై వేస్తున్న భారాలకు నిరసగా ఈ నెల 27న ఉదయం 10.30 గంటలకు విద్యుత్ ఏడీఏ కార్యాలయం వద్ద శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తామని, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు, ప్రజలు పాల్గొనాలని కోరారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, ప్రజాప్రతినిధులు, నాయకులు గిరి రఘు, సింగారపు ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

జంఝావతి కన్నీటియాత్ర

- జంఝావతిని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలని డిమాండ్



జంఝావతి కన్నీటి యాత్రను ప్రారంభిస్తున్న నాయకులు

పార్వతీపురం టౌన్: జంఝావతి ప్రాజెక్టుపై పాలకులు శీతకన్నువేశారు.. ప్రాజెక్టు నుంచి పూర్తిస్థాయిలో ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు.. తక్షణమే జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి.. ప్రాజెక్టు పునర్నిర్మాణం చేపట్టాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మరిశర్ల మాలతీ కృష్ణమూర్తినాయుడు డిమాండ్ చేశారు. ప్రాజెక్టుపై పాలకుల తీరుకు నిరసనగా పార్వతీపురం మండలం వెంకంపేట గ్రామ సమీపంలో సోమవారం 'జంఝావతి కన్నీటియాత్ర'ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒడిశా వివాదం నెపంతో ప్రాజెక్టు పనులను నిలిపివేయడం తగదన్నారు. కూటమి ప్రభుత్వమే రెండు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నందున జిల్లా ఎమ్మెల్యేలు, మంత్రి స్పందించి జంఝావతి రైతుల కన్నీటిని తుడవాలని కోరారు. ప్రస్తుత ప్రభుత్వం తలచుకుంటే ఒడిశా వివాదం పరిష్కారమవుతుందన్నారు. జంఝావతిని సాధించేందుకు ఓ సాధన కమిటీని నియమించాలని కోరారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు జాగారపు ఈశ్వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి రఘు సత్య సింహచక్రవర్తి, బీజేపీ నాయకుడు మరిశర్ల రామారావు, ప్రత్యేక సలహాదారు శివకృష్ణ, విజయనగరం, విశాఖపట్నం సమితి జిల్లా అధ్యక్షుడు ఐ.గోపాలరావు, దేవుపల్లి సత్యారావు పట్నాయక్, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు భారతానంద స్వామి, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన అధికారులు





కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సెర్ప్ డైరెక్టర్ హరిప్రసాద్, ఎల్‌డీఎం విజయ్ స్వరూప్

పార్వతీపురం: సెర్ప్ స్త్రీనిధి డైరెక్టర్ జీవీబీడీ హరిప్రసాద్ కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో స్త్రీనిధి రుణాల మంజూరు వివరాలను తెలియజేశారు. మహిళా సంఘాల జీవనోపాధులకు అవసరమైన రుణాలు మంజూరుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. స్టేట్‌బ్యాంక్ లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎన్.విజయ్‌స్వరూప్ కలెక్టర్‌ను చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. ఖాతాదారులకు మెరుగైన సేవలందించేలా ప్రత్యేక ప్రణాళికలు అమలుచేయాలని కలెక్టర్ సూచించారు.

మొక్కజొన్న సస్యరక్షణ ఇలా..



శాస్త్రవేత్త శ్రీనివాస్

విజయనగరం ఫోర్ట్: ఇటీవల కురిసిన వర్షాల వల్ల మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని, సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎం.శ్రీనివాస్ తెలిపారు. పంట సంరక్షణ చర్యలను సోమవారం వెల్లడించారు. ముందుగా పొలంలో నీరు లేకుండా చేయాలి. అనంతరం 19:19:19 (నీటిలో కరిగేది), ప్రొపికొనజోల్ 200 ఎం.ఎల్, ఇమమెక్టిన్ బెంజియేట్ 80 గ్రాములు ఎకరాకు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పెసర, మినుము పంటల సాంద్రత బాగుంటే ఎకరాకు 10 కేజీల యూరియా వేయాలి. ఆ తర్వాత మల్టీకే, ప్రొపికొనజోల్ 400 ఎం.ఎల్, శాఫ్ 500 ఎం.ఎల్‌ను పదిట్యాంకుల నీటిలో కలిపి పిచికారీ చేయాలని వివరించారు.

పనులు పూర్తి చేయకుంటే చర్యలు

- కలెక్టర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: జిల్లాలో షెడ్యూల్ ప్రకారం అభివృద్ధి పనులు పూర్తిచేయని అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, కాల్వలు, పశువుల శాలలు, ఇతర అభివృద్ధి పనులపై కలెక్టరేట్‌లో సోమవారం సమీక్షించారు. నత్తనడకన సాగుతున్న నిర్మాణాలపై అసంతృప్తి వ్యక్తంచేశారు. పనులు మొదలై నెలరోజులు కావస్తున్నా నేటికీ 50 శాతం పురోగతి లేదని, ఇదే తరహాలో చేస్తే సంక్రాంతి నాటికి పూర్తిచేయడం అసాధ్యమన్నారు. ఉపాధిహామీ మెటీరియల్ కాంపొండ్ కింద జిల్లాకు కేటాయించిన నిధులను వినియోగించలేకపోతే వచ్చే ఏడాది మంజూరుకావన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ కళ్యాణచక్రవర్తి, పంచాయతీ రాజ్ ఎస్ఈ శ్రీనివాసరావు, జెడ్పీ సీఈఓ బీవీ సత్యనారాయణ, డ్వామా ఏఓ వెంకటరమణ, గ్రామ, వార్డు సచివాలయాల అధికారి నిర్మలాదేవి, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ తీరుకు నిరసనగా..

గురువుల అర్ధనగ్న ప్రదర్శన



కలెక్టర్ కార్యాలయ ముఖద్వారం వద్ద అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న గిరిజన గురుకులాల ఉపాధ్యాయులు

- 34వ రోజుకు చేరుకున్న గిరిజన ఉపాధ్యాయుల నిరసన దీక్షలు

పార్వతీపురం: గిరిజన గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయ ప్రధానగేటు వద్ద సోమవారం అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. ఉద్యోగభద్రత కల్పించాలని, సీఆర్టీలుగా మార్చాలని, 2022 పీఆర్సీ ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. డీఎస్సీలో తమ పోస్టులను మినహాయించాలంటూ నినదించారు. అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల జిల్లా అధ్యక్షుడు నిమ్మక దివాకర్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని నెలరోజుల పైబడి దీక్షలు చేస్తున్నా అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంపై మండిపడ్డారు. స్థానికంగా ఉన్న గిరిజన సంక్షేమశాఖ మంత్రికి గురువుల సమస్య పట్టకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం స్పందించి గిరిజన పాఠశాలల్లో పనిచేస్తున్న 1659 మందికి న్యాయం చేయాలని కోరారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తుండడంతో పాఠశాలల్లో ఉపాధ్యాయులు పనిచేయకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు పాలక రంజిత్‌కుమార్, వై.మన్మథరావుతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజన ఉపాధ్యాయులకు సంఘీబావం

గిరిజన ఉపాధ్యాయులకు సంపూర్ణ మద్దతు ఉంటుందని కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్, వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ జేఏసీ జిల్లా కన్వీనర్ డీవీ రమణ, సీఐటీయూ జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ ప్రకటించారు. గిరిజన గురుకుల ఉపాధ్యాయులు చేస్తున్న దీక్ష శిబిరానికి వెళ్లి సంఘీభావం ప్రకటించారు. నిరసన దీక్షలు చేపట్టి 34రోజులు గడుస్తున్నా అధికారులు, పాలకుల్లో చలనం లేదన్నారు. ఎన్నో ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తినే నమ్ముకొని కుటుంబపోషణ చేస్తున్న ఉపాధ్యాయులను అకారణంగా తొలగించడం హేయమైన చర్యగా అభిప్రాయపడ్డారు. సమస్య పరిష్కారమయ్యేంతవరకు ఆందోళన కొనసాగిస్తారన్నారు. ప్రభుత్వం గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి పాకల సన్యాసిరావు, కోరాడ ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

చెప్పేదొకటి.. చేసేదొకటి!



సీతానగరం నుంచి టార్పాలిన్లు కప్పి, ట్రాక్టర్‌తో తరలిస్తున్న ధాన్యం

- ధాన్యం కొనుగోలులో ఆంక్షలు
- అమలు కాని నిబంధనలు
- సొంత ఖర్చుతోనే తరలిస్తున్న రైతులు

సాక్షి, పార్వతీపురం మన్యం: జిల్లాలో ధాన్యం విక్రయాలకు రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం చేసే ప్రకటన ఒకటి.. క్షేత్రస్థాయిలో జరుగుతున్నది మరొకటిగా ఉంది. యంత్రాంగం తీరుపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొదట్లో రైతుకు నచ్చిన మిల్లును ఎంచుకొని.. ట్రక్ షీట్ తీసుకొని తరలించడంతోపాటు వెంటనే డబ్బులు కూడా పొందేవాడు. రవాణా చార్జీలు కూడా మిల్లర్లు భరించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. సుమారు పది రోజులుగా ధాన్యం కొనుగోలులో పెద్ద ఎత్తున ఆంక్షలు పెట్టడంతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. వాతావరణంలో ఏర్పడిన మార్పులు వారిని మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. వర్షాలు పడుతున్నా.. అధికారులు తమకేమీ సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం చెప్పిన దానికి పరిస్థితి పూర్తి భిన్నంగా ఉండడంతో రైతు సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

స్వయంగా ఎండీ చెప్పినా...

పౌర సరఫరాల సంస్థ ఎండీ మనజీర్ జిలానిసమూన్ సీతానగరం మండలంలో ఈ నెల 4న పర్యటించారు. రైతులు ధాన్యాన్ని తమకు దగ్గరలో ఉన్న మిల్లుకు తరలించవచ్చని స్పష్టం చేశారు. అందుకు భిన్నంగా క్షేత్రస్థాయిలో జరుగుతోంది. దూర ప్రాంతంలో ఉన్న మిల్లులకు ట్రక్ షీట్ ఇవ్వడంతో లబోదిబోమంటూ తన సొంత ఖర్చులు పెట్టుకుని వాహనంతో అక్కడికి తీసుకుని వెళుతున్నాడు. ఒక్కొక్క బస్తాకు రూ.30 నుంచి రూ. 40 వరకూ రవాణా చార్జీలు చెల్లిస్తున్నారు. కొంతమంది మిల్లర్లు సరిపడా బ్యాంక్ గ్యారంటీలు ఇవ్వకపోవడం వల్ల.. పూర్తి స్థాయిలో అధికారులు వారికి ధాన్యం ఇవ్వడం కుదరడం లేదు. దీంతో సమీప ప్రాంతాల రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. సీతానగరం మండలం నుంచి రైతులు ధాన్యాన్ని పార్వతీపురం, బలిజిపేట ఇతర ప్రాంతాలకు తీసుకొని వెళుతున్నారు. ఈ బాధలు పడలేక దళారులకు తక్కువ ధరకే ఇచ్చేస్తున్నారు. జిల్లాలో చాలా చోట్ల ఇదే పరిస్థితి ఉందని రైతు సంఘం నాయకులు చెబుతున్నారు.

క్లుప్తంగా

జమ్ముకాశ్మీర్‌పై విదర్భ విజయం



జమ్ము కాశ్మీర్-విదర్భ జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్

విజయనగరం: జిల్లా వేదికగా జరగుతున్న విజయ్ హజారే క్రికెట్ ట్రోఫీలో జమ్ముకశ్మీర్ జట్టుపై విదర్భ జట్టు విజయం సాధించింది. సోమవారం నగర శివారుల్లో గల విజ్జి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచిన విదర్భ జట్టు ముందుగా జమ్ముకశ్మీర్ జట్టును బ్యాటింగ్‌కు ఆహ్వానించగా..44.2 ఓవర్లలో 221 పరుగులకు ఆలౌటయ్యారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన విదర్భ జట్టు 37.1 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 225 పరుగులు జోడించి 6 వికెట్లు తేడాతో విజయం సాధించింది.

లారీ బోల్తా



బైపాస్ రోడ్డు సమీపంలో బోల్తాపడిన లోడు లారీ

గజపతినగరం: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో జాతీయ రహదారి బైపాస్ రోడ్డు కూడలి వద్ద సోమవారం ఉదయం ఓ లారీ బోల్తాపడింది. దీనిపై స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రామభద్రపురం వైపు నుంచి గజపతినగరం మీదుగా విజయనగరం వెళ్తున్న ఐరన్‌వోర్ లోడ్ లారీ అదుపు తప్పి గజపతినగరం మార్గ మధ్యంలో బోల్తా పడింది. బైపాస్ రోడ్డు పనుల్లో కానా నిర్మించి పూర్తి స్థాయిలో మట్టి వేయకపోవడం వల్ల వేసిన మట్టి వర్షాలకు కరిగి పోవడంతో ఎదురుగా వస్తున్న వాహనాలకు సైడ్ ఇచ్చే క్రమంలో లోడుతో ప్రయాణిస్తున్న లారీ కానా కింద లోయలో పడి కూరుకుపోయింది. ఆ సమయంలో జనసంచారం తక్కువగా ఉండడంతో పెనుప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి పాలకొండ రోడ్డులో గుర్తుతెలియని సుమారు 70 సంవత్సరాలు కలిగిన వృద్ధుడి మృతిపై కేసు నమోదు చేసినట్లు సంతకవిటి ఏఎస్సై ఎం.వాసుదేవరావు సోమవారం తెలిపారు. గత ఐదారు సంవత్సరాలుగా యాచక వృత్తిచేసుకుంటూ జీఎంఆర్ గేటు ఎదురుగా ఉన్న బస్‌షెల్టర్‌లో తలదాచుకుంటూ జీవనం సాగిస్తుండేవాడన్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా బస్‌షెల్టర్ తొలగించడంతో రోడ్డుపక్కనే ఉండేవాడని దీనికితోడు ఇటీవల కురిసిన వర్షాలకు అనారోగ్యం బారిన పడి మృతిచెంది ఉంటాడని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని స్థానికులు ఈ నెల 22న సాయంత్రం పానుగుటివలస వీఆర్వో ఎం.రోజారమణికి సమాచారం అందించడంతో ఆమె ఫిర్యాదు మేరకు గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు కేసు నమోదుచేశామని ఏఎస్సై తెలిపారు.

2025 నాటికి రక్తహీనత నివారణ జిల్లాగా పార్వతీపురం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: రక్తహీనత నివారణ జిల్లాగా పార్వతీపురం మన్యం జిల్లాను 2025 నాటికి తీర్చిదిద్దాలని కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ అధికారులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం రక్తహీనత నివారణ కమిటీలు, రక్తదాన శిబిరాలు, పల్లెపండగ, పీజీఆర్ఎస్ తదితర అంశాలపై కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువ మంది గర్భిణులు, బాలింతలు, కిశోరీ బాలికలు రక్తహీనతతో బాధపడుతున్నారని, దాని నివారణకు జిల్లా, మండల, గ్రామ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ఎంపీడీఓ మండల స్థాయిలో రక్తహీనత నివారణ కమిటీలో నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. మహిళా సంఘ సభ్యులు, ఏఎన్ఎం, ఆశ, మహిళా పోలీస్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సభ్యులుగా ఉంటారని తెలిపారు. ప్రతి నెల మొదటి, మూడవ గురువారం కమిటీ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. రక్తహీనత గల వ్యక్తిని దత్తత తీసుకుని ఆరోగ్యం మెరుగుపడేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిక్షయ మిత్ర కార్యక్రమంలో రూ.4,200 చెల్లిస్తే ఆరు నెలలకు సరిపడా పౌష్టికాహారాన్ని అందిస్తారని, రక్తదాన శిబిరాలను నిర్వహించాలని చెప్పారు. పల్లె పండగ కార్యక్రమంలో మంజూరైన అభివృద్ధి పనుల నిర్వహణలో జాప్యం చేస్తున్న పంచాయతీరాజ్ సహాయ ఇంజినీర్లపై చర్యలు తీసుకోవాలని సంబంధిత ఉన్నతాధికారులకు సిఫారసు చేశారు. పార్వతీపురం ఐటీడీఏ పీఓ, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, సీతంపేట ఐటీడీఏ పీఓ, పాలకొండ సబ్ కలెక్టర్ సి. యశ్వంత్ కుమార్ రెడ్డిలు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. సమావేశంలో డీఆర్ఓ కె.హేమలత, ఈపీడీసీఎల్ ఎస్ఈ కె.చలపతిరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ ప్రభాకరరావు, డీపీఓ టి. కొండలరావు, డీఈఓ ఎన్. తిరుపతినాయుడు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఐసీడీఎస్ పీడీ ఎంఎన్‌రాణితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం దిశగా చర్యలు



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



పీజీఆర్ఎస్ రిసెప్షన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ ఎస్వీ మాధవ రెడ్డి



సమస్యలను వింటున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

పార్వతీపురం: సమస్యలను సావధానంగా విని, తక్షణమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖాధికారులను పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టరేట్ లోని సమావేశమందిరంలో ప్రజా సమస్యల పరిష్కారవేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 149మంది నుంచి కలెక్టర్‌తోపాటు సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, కేఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, డీఆర్ఓ కె.హేమలతలు అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అర్జీదారులకు సంతృప్తికర పరిష్కారం లభించాలని, ఎట్టిపరిస్థితిలోను అర్జీలు పునఃప్రారంభం కారాదన్నారు.

పీజీఆర్ఎస్ రిసెప్షన్ సెంటర్ ప్రారంభం

కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్‌ను కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ప్రారంభించారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చిన పలువురు అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో కొత్తగా పీజీఆర్ఎస్ రిసెప్షన్ సెంటర్‌ను ప్రారంభించామని తెలిపారు. ఇక్కడ అర్జీలను ఇవ్వడానికి వచ్చే ప్రజలకు తాగునీటి సదుపాయం, టీ ఇచ్చే ఏర్పాటుచేసినట్లు చెప్పారు. పీజీఆర్ఎస్‌లో ప్రజలతో బాగా మమేకమై బాగా పనిచేసిన అధికారులను గుర్తించి చిన్న జ్ఞాపికతో ప్రతి సోమవారం సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు కె.రామచంద్రరావు, వై.సత్యం నాయుడు, జిల్లా విద్యా శాఖాధికారి ఎన్.తిరుపతి నాయుడు, జిల్లా పశు వైద్య శాఖాధికారి డా.ఎస్.మన్మథరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె.రాబర్ట్ పాల్, ఎల్‌డీఎం జేఎల్ ఎస్.మూర్తి, జిల్లా మత్స్య శాఖాధికారి వి.తిరుపతయ్య, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీర్రాజు, ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ ఒ.ప్రభాకరరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.ఎం.వినోద్ కుమార్, జిల్లా ప్రోగ్రాం అధికారి డా.టి.జగన్మోహన్ రావు, ఇతర అధికారులు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా ఫిర్యాదులను పరిష్కరించాలి

పార్వతీపురంటౌన్: పీజీఆర్ఎస్ ఫిర్యాదులను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి అర్జీదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబకలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రులు, భర్త/అత్తారింటి వేధింపులు, భూ ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీ, ఆన్‌లైన్ మోసం, ప్రేమపేరుతో మోసం, ఇతర సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదు పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవాలైనట్‌లతే చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ ఎస్సై ఫకృద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

వినతులను అప్‌లోడ్ చేసే సిబ్బందికి శిక్షణ

విజయనగరం అర్బన్: ప్రజల నుంచి వచ్చే అర్జీలను అప్‌లోడ్ చేసే సిబ్బందికి కలెక్టరేట్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ తెలిపారు. ప్రతి కార్యాలయంలో అప్‌లోడ్ చేసే కంప్యూటర్ ఆపరేటర్ పేరు, ఫోన్ నంబర్‌ను సోమవారం సాయంత్రంలోగా కలెక్టరేట్‌కు సమర్పించాలని వారందరికీ అర్జీలను ఎలా అప్‌లోడ్ చేయాలి, చెక్‌లిస్టు తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్జీలకు అధికారులు నాణ్యమైన సమాధానాలు ఇచ్చేలా పర్యవేక్షించేందుకు పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, వ్యవసాయం, ఆర్‌డబ్ల్యుఎస్, సెర్ప్, వైద్యారోగ్యం, పౌర సరఫరాలు తదితర 13 శాఖలకు సంబంధించి ఆడిట్ అధికారుల బృందాలను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ బృందం ఆయా శాఖలకు వచ్చే ప్రతి అర్జీని ట్రాక్ చేయడం, అర్జీ డిస్పోజ్ అయ్యే వరకూ పర్యవేక్షించడం చేస్తుందన్నారు. తప్పుడు సమాధానాలు ఇవ్వకుండా తనిఖీ చేయడం, తప్పుడు ఎండార్స్ మెంట్ వేస్తే రీ ఓపెన్ చేసి తిరిగి ఆ శాఖకు పంపడం, అర్జీదారు సంతృప్తి చెందేలా సమాధానాలు ఇవ్వడంలో సహకరించడం, సలహాలు ఇవ్వడం వంటి విధులు చేయాలన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి 140 వినతులను కలెక్టర్ అంబేడ్కర్ స్వీకరించారు.

● సబ్‌జైల్ తనిఖీ



సబ్‌జైలును పరిశీలిస్తున్న విజయనగరం జిల్లా ప్రధాన న్యాయ మూర్తి బి.సాయి కల్యాణ చక్రవర్తి

పార్వతీపురం టౌన్: పట్టణంలోని సబ్‌జైల్‌ను విజయనగరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ చక్రవర్తి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ జైల్ పరిసరాలు, శానిటేషన్‌ను పరిశీలించారు. రికార్డులను, ఖైదీల హాజరు పట్టికను పరిశీలించి సబ్ జైల్ అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఖైదీలతో మాట్లాడారు. వారికి అందించే ఆహారం నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. ప్రధాన సమస్యలు ఏమైనా ఉంటే తెలియజేయాలని ఖైదీలను కోరారు. న్యాయవాదిని నియమించుకోలేని వారికి న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. ఖైదీలలో సత్ప్రవర్తనతోనే మార్పు సాధ్యమవుతుందని జడ్జి అన్నారు. కార్యక్రమంలో పార్వతీపురం జిల్లా రెండవ అదనపు జడ్జి ఎస్.దామోదరరావు, లోక్ అదాలత్ సభ్యుడు టి.జోగారావు, మాజీ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.వెంకటరావు, సబ్‌జైల్ సూపరింటెండెంట్ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు



బస్సు సీట్ల మధ్య ఇరుక్కుని నరకయాతన పడుతున్న మహాలక్ష్మి

- బస్సును వెనుక నుంచి మరో లారీ ఢీ
- పలువురు ప్రయాణికులకు తీవ్రగాయాలు



బస్సు,లారీ ఢీ కొట్టిన దృశ్యం

రామభద్రపురం: మండలంలోని ఆరికతోట ముచ్చర్లవలస గ్రామాల మధ్యలో ఉన్న రాజస్థానీ డాబా వద్ద జాతీయ రహదారిపై సోమవారం లారీలు, బస్సు ఢీకొనడంతో బస్సులో ఉన్న పలువురు ప్రయాణికులకు తీవ్రగాయాలయ్యాయి. ప్రయాణికుల్లో ఒకరైన బొండపల్లి మండలంలోని గరుడబిల్లికి చెందిన రెడ్డి మహాలక్ష్మి రెండు కాళ్లు రెండు సీట్ల మధ్య ఇరుక్కోవడంతో గంటన్నర పాటు నరకయాతన పడింది. సమాచారం మేరకు వచ్చిన పోలీసులు, స్థానికులతో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. నుజ్జునుజ్జయిన బస్సు సీట్లను జేసీబీ సహాయంతో లాగి సీట్ల మధ్య ఇరుకున్న మహిళ కాళ్లను తీశారు. ఎస్సై వి.ప్రసాదరావు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ఆటోలో స్థానిక క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలించారు. అదే బస్సులో బొబ్బిలి వెళ్తున్న ఆరికతోట గ్రామానికి చెందిన సురగాల సౌజన్య గాయపడి బొబ్బిలి సీహెచ్‌సీలో చికిత్స పొందుతుండగా విజయగనగరానికి చెందిన చిన్నారి పి.ప్రసన్నశ్రీ స్థానిక క్వీన్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ సంఘటనలో పెను ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. తహసీల్దార్ సులోచనరాణి, ఎస్సై వి.ప్రసాదరావులతో కలిసి ఆర్డీవో రామ్మోహనరావు సంఘటన స్థలంతో పాటు క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు.

ప్రమాదం జరిగిందిలా..

విజయనగరం డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు విజయనగరం నుంచి పార్వతీపురం 45 మంది ప్రయాణికులతో వెళ్తోంది. సరిగ్గా ఆరికతోట సమీపంలో రాజస్థానీ డాబా వద్దకు వచ్చేసరికి ముందు వెళ్తున్న లారీ సిగ్నల్ లైట్లు వేయకుండా నెమ్మదించింది. అదే సమయంలో ముందున్న వాహనానికి 50 అడుగుల దూరం ఉండాలన్న నిబంధన పాటించకుండా వెనుక నుంచి వస్తున్న బస్సు ఆ లారీని బలంగా ఢీకొట్టింది. అదే రూట్‌లో బస్సు వెనుక వస్తున్న మరో లారీ బస్సు వెనుక భాగాన్ని ఢీ కొట్టింది. దీంతో బస్సులో ఉన్న పలువురికి గాయాలయ్యాయి. ప్రమాదంలో బస్సుతో పాటు రెండు లారీలది తప్పేనని, మూడు వాహనాలను సీజ్ చేసి ఆయా డ్రైవర్లపై కేసు నమోదు చేస్తామని ఎస్సై వి.ప్రసాదరావు తెలిపారు.

ధాన్యం కొనుగోలులో అలసత్వం వహిస్తే చర్యలు

- జేసీ శోభిక హెచ్చరిక



మాట్లాడుతున్న జేసీ శోభిక

సీతంపేట: ధాన్యం కొనుగోలులో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ శోభిక హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం ఆమె సీతంపేట ఐటీడీఏలో తహసీల్దార్లు, రైస్ మిల్లర్లు, డిప్యూటీ తహసీల్దార్‌లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందులు పెట్టవద్దని సూచించారు. వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి బిల్లులు అప్‌లోడ్ చేయాలని చెప్పారు. రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తూకాలు, కొలతల్లో ఎటువంటి మోసాలు లేకుండా చూడాలని, రైతుల నుంచి ఎటువంటి నగదు వసూలు చేయరాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్ సెల్‌కు 17 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్:

ప్రజల సమస్యల తక్షణ పరిష్కారానికి 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఆయన గ్రీవెన్స్‌సెల్ నిర్వహించి ప్రజల నుంచి 17 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చట్టపరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని ఆదేశించారు. తీసుకున్న చర్యలపై నివేదికలను తనకు అందించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ సీఐ ఎస్.శంకరరావు, ఎస్పీ సీఐ ఎ.లీలారావు, ఎస్సై రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా రైతుకు సన్మానం



మహిళా రైతు పల్ల శంకరమ్మను సన్మానిస్తున్న ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా మేనేజర్, సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడకుండా గడిచిన ఎనిమిదేళ్లుగా ప్రకృతి వ్యవసాయ విధానాలను ఆచరిస్తున్న గుమ్మలక్ష్మీపురం మండలం వంజరాపుగూడ గ్రామానికి చెందిన పల్ల శంకరమ్మను ప్రకృతి వ్యవసాయ విభాగం సన్మానించింది. ఆమె తనకున్న రెండు ఎకరాల భూమిలో 365 రోజుల పాటు వివిధ పంటలు సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తుండడంతో ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ పి.షన్ముఖరాజు, సిబ్బంది జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా గుమ్మలక్ష్మీపురంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్ఐటీఐ వద్ద విద్యార్థుల సమక్షంలో సోమవారం సన్మానించారు. ఈ మేరకు జ్ఞాపికతో పాటు ప్రశంసాపత్రం అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా మేనేజర్ పి.షన్ముఖరాజు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల పెట్టుబడులు తగ్గుతాయని, నేల సారవంతం అవుతుందని, ఆరోగ్యకరమైన పంటలు పండి, రైతుకు ఆదాయం దండిగా లభిస్తుందన్నారు. కావున ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేసేలా విద్యార్థులు అవగాహన కలిగి ఉండి గ్రామాల్లోని రైతులకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం ఎంఎంటీఎల్ వై.గణేష్ శరత్ చంద్ర, ఎంటీలు జి.నిర్మలా దేవి, ఎల్.నరసింహ, సిబ్బంది టి.రవి, పి.ప్రసాద్, మిన్నారావు, కె.భూషణ్ తదితరులు ఉన్నారు.

27న విజయవాడలో వాలీబాల్ జట్టు ఎంపికలు

- జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు

విజయనగరం: జాతీయస్థాయిలో జరగనున్న సీనియర్స్ వాలీబాల్ పోటీల్లో పాల్గొనబోయే స్త్రీ, పురుషుల రాష్ట్ర జట్ల ఎంపికలు ఈనెల 27న విజయవాడలో నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 7 గంటల నుంచి ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని ఎంపికల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు ఆధార్ కార్డు, నేటివిటీ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలతో హాజరుకావాలని సూచించారు. ఆ రోజు రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు వచ్చే ఏడాది జనవరి 7 నుంచి 13వ తేదీ వరకు రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో జరగనున్న సీనియర్స్ జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు.

ఆసక్తి గల క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని మరిన్ని వివరాలకు ఫోన్ 94917 67327, 8074116276 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- జేసీ శోభిక, ఎమ్మెల్యే జయకృష్ణ
- భామినిలో పత్తికొనుగోలు కేంద్రం ఏర్పాటు



పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, జేసీ శోభికలు

భామిని: రైతు సంక్షేమానికి కట్టుబడి ప్రభుత్వం పనిచేస్తుందని పార్వతీపురం మన్యం జిల్లా జేసీ ఎస్.ఎస్.శోభిక, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణలు అన్నారు. ఈ మేరకు సోమవారం భామిని మండల కేంద్రంలో ఎఫ్‌సీఐ గోదాంల ప్రాంగణంలో సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభించి మాట్లాడారు. ఇప్పటికే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో రైతుకు ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తోందని ఎమ్మెల్యే జయకృష్ణ స్పష్టం చేశారు. రైతులు పండించే నాణ్యమైన పత్తి కొనుగోలుకు రెండు కేంద్రాల కోసం అదనంగా ప్రయత్నించగా సీసీఐ అధికారులు భామినిని ఎంపిక చేశారని జేసీ వివరించారు. ఏఎంసీ కార్యదర్శి వారణాసి సతీష్‌కుమార్, కూటమి నాయకులు లోపింటి రాజేష్, బిడ్డిక విష్ణు, వి.రవినాయుడు, బి.ఆనందరావు, ఎం.జగదీశ్వరరావు, కిరణ్‌కుమార్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ముంపు పొలాల పరిశీలన



మొలకెత్తిన వరిపంటను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్

బొండపల్లి: మండల కేంద్రంలోని తుఫాన్ ప్రభావంతో ముంపు బారిన పడి మొలకలు వచ్చిన వరి పొలాలను రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమలు,సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొడపల్లి శ్రీనివాసరావు సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తమకు నష్టపరిహారం అందచేయకపోయినా పర్వాలేదు కానీ ప్రభుత్వం రంగు మారిన ధాన్యంతో పాటు మొలకలు వచ్చిన ధాన్యం మిల్లర్లు ద్వారా కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ రంగు మారిన ధాన్యం పెద్ద మొత్తంలో ఒకే మిల్లుకు వచ్చే కన్నా సమానంగా అన్ని మిల్లులుకు తరలించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఇంత వరకు ఎంత విస్తీర్ణంలో వరి పంట దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారని జేడీఏ రామరావును అడగ్గా 360 ఎకరాల్లో పంట పూర్తిగా దెబ్బతిన్నట్లు గుర్తించినట్లు ఆయన మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పొలాల్లో వరదనీరు పూర్తిగా పోయిన తర్వాత క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించి సమగ్ర పంటనష్ట నివేదికలు అందిస్తారని చెప్పారు. అపరాలు పంటకు సంబంధించి రైతులు ఎకరాకు రూ.300 చొప్పున చెల్లించి ఇన్సూరెన్స్ చేయించుకోవాలని రైతులకు మంత్రి సూచించారు. కార్యక్రమంలో జేడీఏ వీటీ రామరావు, ఏడీఏ కె.మహారాజన్, తహసీల్దార్ డోలా రాజేశ్వర్రావు, ఎంపీడీఓ గిరిబాల, ఏఓ పి.వి.మల్లికార్జునరావు, ఏఈఓ సంతోష్ కుమార్ నాయకులు కోరాడ కృష్ణ, నంబూరి రాజేష్, ముంజేటి పార్వతి, కొండపల్లి భాస్కర నాయుడు, బుచ్చిరాజు, తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఉపేంద్ర, (వెనుక ముసుగులో నిందితుడు)

రాజాం సిటీ: ఓ యువకుడిని వ్యసనాలు దొంగగా మార్చాయి. ఈ క్రమంలో ఏడాది నుంచి తాళం వేసిన ఇళ్లను టార్గెట్‌గా చేసుకుని దొంగతనాలకు ఒడిగడుతూ చివరికి పోలీసులకు పట్టుబడి కటకటాలపాలయ్యాడు. ఈ విషయానికి సంబంధించి రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర తన కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. రేగిడి మండలంలోని తునివాడ గ్రామానికి చెందిన వంజరాపు లలితమ్మ ఇంటికి తాళం వేసి విశాఖపట్నంలో ఉన్న తన కుమార్తె వద్దకు వెళ్లింది. ఆమె తిరిగి వచ్చి చూసేసరికి ఇంట్లో ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి బీరువాలో ఉన్న బంగారపు గొలుసు చోరీ చేయగా ఆమె రేగిడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై పి.నీలావతి కేసు నమోదుచేసి ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో అదే మండలం చిన్నయ్యపేట సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న పాలకొండ మండలం యరకారాయపురం గ్రామానికి చెందిన శ్రీరామ బాలరాజును అదుపులోకి తీసుకుని విచారణ చేయగా ఇప్పటికే దేవుదల, కాగితాపల్లి గ్రామాలతో పాటు సంతకవిటి మండలంలోని కొండగూడెం గ్రామాల్లో కూడా దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించాడు. అనంతరం నిందితుడి నుంచి మొత్తం రూ.7.20 లక్షల విలువైన 90 గ్రాముల బంగారానికి సంబంధించి ఒక బంగారు హారం, ఒక బ్రాస్లెట్, రెండు చెవి దిద్దులు, రెండు బంగారు గొలుసులు, రెండు చెవిపోగులు, రూ.30వేల విలువైన 30 తులాల రెండు వెండిపట్టీలతో పాటు రూ.5వేల నగదు స్వాధీనం చేసుకుని నిందితుడిని కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించామని సీఐ ఉపేంద్ర వివరించారు. కార్యక్రమంలో రేగిడి ఎస్సై పి.నీలావతి, సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹200